


ప్రభుత్వ ఫ్లెక్సీలు ఏర్పాటుచేసి చలివేంద్రాలను ప్రారంభించిన మేయర్, డిప్యూటీ మేయర్

## ఎన్నికల కోడ్ ఉల్లంఘన

### అధికార పార్టీపై నిప్పులు చెరుగుతున్న ప్రతిపక్షాలు, ప్రజా సంఘాల నాయకులు

జవహర్‌నగర్, మార్చి 27 : జవహర్‌నగర్ మేయర్ ఎన్నికల నియమావళిని బేఖాతర్ చేశారు. బుధవారం జవహర్‌నగర్‌లోని డ్వాక్రా భవన్‌లో మేయర్ శాంతి, డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్, కార్పొరేటర్లు ప్రభుత్వ ఫ్లెక్సీలను ఏర్పాటు చేసి చలివేంద్రాలను ప్రారంభించడమే కాకుండా ఆసరా పింఛన్లు పంపిణీ చేశారు. అంతే కాకుండా పింఛన్లు తామే ఇస్తున్నామని, పింఛన్ తీసుకునే వారంతా కాంగ్రెస్ పార్టీకే ఓటువేయాలని తెలిపారు. దీనిపై జవహర్‌నగర్ టీడీపీ అధ్యక్షుడు లక్ష్మణ్ మున్సిపల్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. కలెక్టర్ స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.



## పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకోవాలి

### శిక్షణకు గైర్హాజరైన వారిపై క్రమశిక్షణ చర్యలు, సస్పెన్షన్
### సమావేశంలో ఎన్నికల అధికారి రొనాల్డ్‌రాస్

సిటీబ్యూరో, మార్చి 27 (నమస్తే తెలంగాణ) : ఎన్నికల విధుల్లో ఉన్న అధికారులు, సిబ్బంది ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కు వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్‌ఎంసీ కమిషనర్ రొనాల్డ్‌రాస్ అధికారులను ఆదేశించారు. పార్లమెంట్ ఎన్నికల నిర్వహణ నేపథ్యంలో బుధవారం జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమిషనర్ చాంబర్‌లో హైదరాబాద్, సికింద్రాబాద్ రిటర్నింగ్ అధికారులు, ఎన్నికల విభాగం అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి మాట్లాడుతూ... ఎన్నికల విధులు నిర్వహించే అధికారులు, ఇతర పోలింగ్ సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ అందజేయడం, పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియ, నిబంధనలు, ఫెసిలిటేషన్ సెంటర్‌ల ఏర్పాటు తదితర అంశాలపై దిశానిర్దేశం చేశారు. ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బందికి తమ ఓటు హక్కు వినియోగించుకోవడానికి ఎన్నికల కమిషన్ పోస్టల్ బ్యాలెట్ సౌకర్యాన్ని కల్పించిందని తెలిపారు. ఎన్నికల విధులు కేటాయించిన సిబ్బందికి మొదటి విడత శిక్షణ కార్యక్రమంలోనే ఫారం-12 అందించి, పోస్టల్ బ్యాలెట్‌పై పూర్తి అవగాహన కల్పించాలన్నారు. ఎన్నికల విధులు నిర్వహించే వారు తమ ఎపిక్ కార్డుతో పాటు పార్ట్‌నంబర్, సీరియల్ నంబర్ కూడా శిక్షణ తరగతులకు హాజరయ్యే సందర్భంలో తీసుకొని వచ్చేలా మెసేజ్ పంపించాలన్నారు. ఎలక్షన్ కమిషన్ సూచించిన ఎమర్జెన్సీ సర్వీస్ శాఖలకు నోడల్ ఆఫీసర్‌ను నియామకం చేసేందుకు లేఖ రాయాలని, వారి వివరాలను పంపించాలని ఎలక్షన్ అడిషనల్ కమిషనర్‌ను ఆదేశించారు. ఎన్నికల విధులకు ఉత్తర్వులు జారీ చేసిన వారు శిక్షణకు గైర్హాజరు అయిన పక్షంలో క్రమశిక్షణ చర్యల్లో భాగంగా సస్పెన్షన్‌తో పాటు ఎఫ్‌ఐఆర్ కూడా నమోదు చేసేందుకు వెనుకాడవద్దని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, సికింద్రాబాద్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జిల్లా అదనపు కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్, ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ హేమంత్ బోర్కడే, జీహెచ్‌ఎంసీ ఎన్నికల అదనపు కమిషనర్ అలివేలు మంగతాయారు, ఏఆర్‌ఓలు, ఎన్నికల విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

## పీహెచ్‌డీ కోర్స్ వర్క్ పరీక్షా తేదీల ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ, మార్చి 27: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని పీహెచ్‌డీ కోర్స్ వర్క్ (ప్రీ పీహెచ్‌డీ) పరీక్షా తేదీలను ఖరారు చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రీ పీహెచ్‌డీ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్షలను ఏప్రిల్ 23 నుంచి నిర్వహించనున్నారు.

### లా ఫలితాలు విడుదల

ఓయూ పరిధిలోని ఐదేండ్ల బీబీఏ ఎల్‌ఎల్‌బీ, ఐదేండ్ల బీకామ్ ఎల్‌ఎల్‌బీ, మూడేండ్ల ఎల్‌ఎల్‌బీ, మూడేండ్ల ఎల్‌ఎల్‌బీ ఆనర్స్ కోర్సుల పరీక్షా ఫలితాలను అధికారులు విడుదల చేశారు. ఈ ఫలితాలను www.osmania.ac.inలో అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు.



## మెరుగైన వైద్య సేవలు అందించాలి

సిటీబ్యూరో, మార్చి 27(నమస్తే తెలంగాణ) : నాన్ కమ్యూనికేబుల్ డిసీజెస్(ఎన్‌సీడీ)పై చార్మినార్ జోన్ పరిధిలో డీఎంహెచ్‌ఓ సమీక్ష నిర్వహించారు. బుధవారం రివ్యూ మీటింగ్ ఎన్‌సీడీ ప్రోగ్రాం ద్వారా సూరజ్‌భన్, జంగంమెట్ క్లస్టర్ పరిధిలో జరిగిన సమావేశంలో డా. సునంద ఎస్‌పీహెచ్‌ఓ, బస్తీ దవాఖాన వైద్యులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సీడీ స్క్రీనింగ్ గురించి వివరించారు. ప్రతి రోజు 25 మందికి స్క్రీనింగ్ చేయాలని, ఔట్ పేషంట్లకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. టెలి మెడిసిన్ విధానాన్ని విస్తృతంగా వినియోగించాలని సూచించారు. వైద్యులు వంద శాతం ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డీఎంహెచ్‌ఓ స్పష్టం చేశారు.



# హోరెత్తిన ఉప్పల్

### సన్ రైజర్స్ హైదరాబాద్, ముంబై ఇండియన్స్ 'ఢీ'

సిటీబ్యూరో, మార్చి 27 (నమస్తే తెలంగాణ)/ఉప్పల్, మార్చి 27 : ఉప్పల్ స్టేడియం వేదికగా బుధవారం సన్‌రైజర్స్ హైదరాబాద్, ముంబై ఇండియన్స్ తలపడ్డాయి. ఈ మ్యాచ్‌ను వీక్షించేందుకు క్రికెట్ అభిమానులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. దారులన్నీ ఉప్పల్ స్టేడియం వైపునకే మళ్లాయి. సాయంత్రం 7:30గంటలకు మ్యాచ్ ఉండగా.. సాయంత్రం 4 గంటల నుంచే అభిమానులను లోపలికి అనుమతించారు. పోలీసులు పటిష్ట భద్రత ఏర్పాటు చేశారు. మరోవైపు ఐపీఎల్ టికెట్ల బ్లాక్ దందా జోరుగా సాగింది. హెచ్‌సీఏ జారీ చేసిన పాస్‌లు పక్కదారి పట్టాయని అభిమానులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంప్లిమెంటరీ పాస్‌లను బ్లాక్‌లో అమ్ముతున్నారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఐపీఎల్ మ్యాచ్ నేపథ్యంలో మెట్రో అధికారులు అర్ధరాత్రి వరకు మెట్రో రైళ్లను నడిపారు.







# ప్రభుత్వ స్థలంలో ప్రైవేటు రోడ్డు

### అనుమతులు లేని లేఅవుట్‌కు దారి
### మాజీ మేయర్ పై ఆగ్రహం
### వ్యక్తం చేసిన డిప్యూటీ, కార్పొరేటర్లు

బండ్లగూడ,మార్చి 27: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ భవన నిర్మాణం కోసం కేటాయించిన స్థలంలో నుంచి అనుమతులు లేని లేఅవుట్‌కు రోడ్డు వేసేందుకు అనుమతులు ఇచ్చారని మాజీ మేయర్ మహేందర్‌గౌడ్‌తో పాటు అధికారులపై డిప్యూటీ మేయర్ రాజేందర్‌రెడ్డి, పలువురు కార్పొరేటర్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం వారు నూతన కార్పొరేషన్ భవనాన్ని పరిశీలించారు. కార్పొరేషన్ భవన నిర్మాణానికి రెండెకరాల 7 గుంటలు కేటాయించగా.. అందులో సుమారు ఒక ఎకరా స్థలంలో భవనాన్ని నిర్మించి, వాస్తు కోసం స్థలంను వదిలినట్లు అధికారులు తెలిపారు. కాగా వాస్తు కోసం ఆ స్థలం వదలాల్సిన అవసరం లేదని, వెనకాల ఉన్న మాజీ మేయర్ బంధువులు వేసిన లేఅవుట్‌కు రోడ్డు వేసేందుకు అధికారులతో కలిసి వాస్తు పేరుతో ప్రభుత్వ స్థలాన్ని ఇచ్చారని ఆరోపించారు. ఈ విషయం పై కార్పొరేటర్లు నిరసన తెలిపారు. రెవెన్యూ అధికారులతో పాటు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు అస్లాంబిన్ అబ్దుల్లా, చంద్రశేఖర్, భూపాల్‌గౌడ్, ప్రశాంత్‌నాయక్, నాయకులు ప్రేమ్‌గౌడ్, గోపాల్ ముదిరాజ్, సంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం పక్కనుంచి అక్రమ లేఅవుట్‌కు వేసిన రోడ్డు



## ఎల్లమ్మ సన్నిధిలో నీతా అంబానీ..

ముంబై ఇండియన్స్ టీమ్ యజమాని, రిలయన్స్ అధినేత ముఖేశ్ అంబానీ సతీమణి నీతా అంబానీ బుధవారం బల్కంపేట ఎల్లమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. ఉప్పల్‌లో ముంబై ఇండియన్స్ మ్యాచ్ జరుగుతున్న నేపథ్యంలో నీతా అంబానీ హైదరాబాద్‌కు వచ్చారు. మ్యాచ్‌ను వీక్షించే ముందు ఆమె రాత్రి 7.30 గంటల సమయంలో బల్కంపేట ఎల్లమ్మ ఆలయానికి చేరుకున్నారు. ఆమెకు ఆలయ ఈవో కుంట నాగరాజు, ఆలయ చైర్మన్ కొత్తపల్లి సాయిగౌడ్ స్వాగతం పలికారు. దాదాపు 15 నిమిషాల పాటు నీతా అంబానీ అమ్మవారి సన్నిధిలో గడిపారు. - అమీర్‌పేట్, మార్చి 27

# పీఎఫ్ సమస్యల పరిష్కారానికి చర్యలు

సిటీబ్యూరో, మార్చి 27(నమస్తే తెలంగాణ): ప్రావిడెంట్ ఫండ్ సమస్యల సత్వర పరిష్కారానికి ప్రత్యేక కార్యక్రమం చేపడుతున్నట్లు అసిస్టెంట్ ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్ పీవీ రావు పేర్కొన్నారు. ప్రైవేటు సెక్టార్‌లో పనిచేస్తున్న ఉద్యోగుల ప్రావిడెంట్ ఫండ్ సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు, పదవీ విరమణ పొందుతున్న ఉద్యోగులకు పెన్షన్ పేమెంట్ ఆర్డర్స్ అందజేసేందుకు నిధి ఆప్ కే నిఖత్ 2.0 కార్యక్రమం నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఖైరతాబాద్ సరస్వతి విద్యా పీఠం సంస్థలో పెన్షన్ పేమెంట్ ఆర్డర్స్ అందజేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా నోడల్ అధికారి జీ. వరప్రసాద్, సోషల్ సెక్యూరిటీ అసిస్టెంట్స్ పీ. మేఘన, రాహుల్ రావత్, సరస్వతి విద్యాపీఠం, ఉద్యోగులు, పెన్షనర్లు పాల్గొన్నారు.



## 'జంతు' వ్యాధుల నియంత్రణకు కృషి

సిటీబ్యూరో, మార్చి 27(నమస్తే తెలంగాణ) : పశు సంపదకు పొంచి ఉన్న ముప్పును నియంత్రించేలా ప్రపంచ దేశాలు కలిసి పనిచేయాలని ఇండియన్ ఇమ్యూనోలాజికల్ లిమిటెడ్ పరిశోధకులు సూచించారు. న్యూజిలాండ్ వ్యవసాయ, పశు సంవర్ధక వైద్య నిపుణులతో జరిగిన సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. న్యూజిలాండ్ హైకమిషన్ ప్రతినిధులు, వ్యవసాయ నిపుణులు, వెటర్నరీ పరిశోధన బృందం గచ్చిబౌలిలోని ఇండియన్ ఇమ్యూనోలాజికల్స్ లిమిటెడ్ ప్రతినిధులతో భేటీ అయ్యారు.కార్యక్రమంలో న్యూజిలాండ్ ప్రతినిధులు హమీష్ మార్, మెలానీ ఫిలిప్స్, హాల్ సెల్లర్స్, కేతోసెనో పెసేయ్ తదితరులు పాల్గొన్నారు.

## బిట్స్‌లో ఇంటిగ్రేటెడ్ లెర్నింగ్ సదస్సు

జవహర్‌నగర్, మార్చి 27: బిట్స్ ఫిలానీ క్యాంపస్‌లో వచ్చే నెల 15, 16న ఇంటిగ్రేటెడ్ లెర్నింగ్ సదస్సు నిర్వహించనున్నట్లు బిట్స్ ఫిలానీ అధికారులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో భవిష్యత్ దిశలపై అంచనాలు, బోధన పద్ధతులు, నమూనాలు, ఆవిష్కరణ, ఇన్నోవేటివ్ లెర్నింగ్ సొల్యూషన్స్ షోకేస్ వంటి అంశాలపై దేశంలోని వివిధ యూనివర్సిటీల ప్రొఫెసర్లు హాజరవనున్నట్లు పేర్కొన్నారు. ఏప్రిల్ 15, 16న నిర్వహించే ఈ ప్రోగ్రాంకు ఆసక్తి గల విద్యార్థులు బిట్స్ ఫిలానీ క్యాంపస్‌లో వివరాలు తెలుసుకోవాలని కోరారు.





బుధవారం బంజారాహిల్స్‌లోని పార్క్‌హయత్ హోటల్‌లో నిర్వహించిన ది ఆర్ట్స్ కార్వాస్ ఎగ్జిబిషన్‌లో పెయింటింగ్స్‌ను పరిశీలిస్తున్న భారత క్రికెట్ టీం మాజీ కెప్టెన్ కపిల్ దేవ్, రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్



## రూ.16 కోట్లు పన్ను చెల్లించిన ఐడీపీఎల్

సిటీబ్యూరో, మార్చి 27 (నమస్తే తెలంగాణ): ఆస్తి పన్ను బకాయిదారులు వన్‌టైమ్ సెటిల్‌మెంట్ (ఓటీఎస్) పథకం కింద 90 శాతం వడ్డీ మాఫీకి ఈ నెలాఖరు వరకు గడువు ఇచ్చిన నేపథ్యంలో స్కీంను సద్వినియోగం చేసుకునేందుకు ముందుకు వస్తున్నారు. ఈ నేపథ్యంలోనే కూకట్‌పల్లి ఐడీపీఎల్ కంపెనీ బకాయి ఉన్న రూ.16కోట్లను చెక్కు రూపేణా బుధవారం జీహెచ్‌ఎంసీ కమిషనర్ రొనాల్డ్‌రాస్‌ను కలిసి కంపెనీ ప్రతినిధులు అందజేశారు. ఈ సందర్భంగా ఐడీపీఎల్ సంస్థ బకాయిలు చెల్లించినందుకు కమిషనర్ కృతజ్ఞతలు తెలిపారు. మిగతా ప్రభుత్వ కంపెనీలు, కార్యాలయాలు, ఆస్తిపన్ను బకాయిదారులు మార్చి 31 వరకు చెల్లించి రాయితీ పొందాలని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐడీపీఎల్ కంపెనీ ప్రతినిధులు, అదనపు కమిషనర్లు జయరాజ్ కెన్నెడీ, గీత రాధిక, వాల్యుయేషన్ ఆఫీసర్ మహేశ్ కులకర్ణి తదితరులు పాల్గొన్నారు.



## రానున్న రోజుల్లో షార్ట్ ఫిలిమ్స్‌దే భవిష్యత్

### ఓయూలో ప్రారంభమైన షార్ట్ ఫిల్మ్ ఫెస్టివల్

ఉస్మానియా యూనివర్సిటీ, మార్చి 27: రానున్న రోజుల్లో షార్ట్ ఫిలిమ్స్‌దే భవిష్యత్తు అని వక్తలు పేర్కొన్నారు. బుధవారం ఉస్మానియా యూనివర్సిటీ జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్ విభాగం ఆధ్వర్యంలో జాతీయ స్థాయి షార్ట్ ఫిల్మ్ ఫెస్టివల్ ప్రారంభమైంది. ఠాగూర్ ఆడిటోరియంలో నిర్వహించిన 'జాష్న్-ఏ-సైన్మా'గా వ్యవహరించే ఈ ఫెస్టివల్‌ను తెలంగాణ ప్రభుత్వ భాషా, సాంస్కృతిక విభాగం సహకారంతో నిర్వహిస్తున్నారు. ఈ ఫెస్టివల్ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి, భాషా సాంస్కృతిక విభాగం డైరెక్టర్ డాక్టర్ మామిడి హరికృష్ణ, ఓయూ వీసీ ప్రొఫెసర్ రవీందర్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సమాజ పురోగమనంలో సినిమా పాత్ర ఎంతో గొప్పదన్నారు. ఎన్ని పుస్తకాలు చదివినా అర్థం కాని విషయాలు రెండు, మూడు గంటల సినిమా చూస్తే స్పష్టంగా అర్థమవుతాయని చెప్పారు. అనంతరం ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ అర్జున్‌రావు ప్రసంగించారు. పలు కార్యక్రమాల గురించి జర్నలిజం విభాగం హెడ్ డాక్టర్ టి.సతీశ్‌కుమార్ వివరించారు.